కథ

# పితరులు




ఎగుమామిడి అయోధ్యారెడ్డి
9399962117

''అరేయ్ బాలూ! ఇంట్లకురా. అచ్చి అన్నం తినిపో!''..

తల్లి పిలుస్తున్నా విని పించుకోకుండా బాలమల్లు పెరట్లో తూనీగలు పట్టుకునే పనిలో ఉన్నడు.

వాటివెనుక తిరుగుతూ ఎంత ప్రయత్నించినా.. ఒక్కటీ చేతికి దొరకడం లేదు. అయినా వాడు పట్టుదలగా వేటాడుతున్నడు.

చలికాలం చివరిరోజులు. ఎండ బాగానే కాస్తున్నది. ఒక్క మబ్బయినా లేకుండా.. ఆకాశం మైదానంలా ఉంది. కొంచెం ఎత్తులో హెలికాప్టర్ల మాదిరి చక్కర్లు కొడుతూ.. రంగురంగుల తూనీగలు స్వేచ్ఛగా తిరుగుతున్నయి. మధ్యమధ్య అలుపు తీర్చుకునేందుకన్నట్టు మొక్కల మీదా, పాత గోడల మీదా వాలుతూ.. అంతలోనే మళ్లీ ఎగిరిపోతున్నయి.

''బాలిగా! ఇనవడ్తలేదా? చెవులల్ల ఏంబెట్టుకున్నవు.. ఎన్నిసార్లు పిలువాలె? ఇంట్లకొచ్చి కూడు తినిపో!''.. తల్లి మరోమారు కేకేసింది.

బాలమల్లు ఈసారీ వినిపించుకోలేదు. గునుగు మొక్కమీద అప్పుడే వాలిన నీలం రంగు తూనీగ మీద వాడి దృష్టి పడింది. చప్పుడు కాకుండా అటు నడిచాడు. నీలి తూనీగలు కొంచెం అరుదుగా కనిపిస్తుంటయి. మిగతావాటి కంటే అందంగా ఉండి, హుషారుగా ఎగురుతూ అంత సులువుగా దొరకవు.

తూనీగల్ని వెంటాడి పట్టుకోవడం, వాటితో ఆడుకోవడం పిల్లలకు ఇష్టమైన సరదా. సన్నగా కొంచెం పొడవైన దేహం, పారదర్శకమైన వెడల్పాటి రెక్కలు, మెరుస్తున్న గుండ్రటి కళ్లతో.. రకరకాల రంగుల్లో కనిపించే ఈ కీటకాలు, వాతావరణాన్ని ఆహ్లాదపరుస్తూ తిరుగుతుంటయి. తూనీగ చేతికి చిక్కగానే ఏ సీసాలోనో, అట్టడబ్బాలోనో వేసి మూతపెట్టడం, లేదా తోకకు దారంకట్టి అది చిన్నగా ఎగురుతుంటే కేరింతలు కొట్టి ఆనందించడం.

'ఓరి పోరగాండ్లు! వాటిని అట్ల గోస పెట్టొద్దు.. పాపం తగుల్తది!' అని పెద్దలు మందలించినా పిల్లలు ఊరుకోరు. మరింత ఉత్సాహంగా వాటిని గోసపెడుతూ ఆడుతరు.

''బాలూ! ఎన్నిసార్లు చెప్పాలె ఇంట్లకు రమ్మని? నేను పెరట్ల కొచ్చిన్నంటే నీ వీపు పగుల్తది'' అదే చివరి హెచ్చరిక అన్నట్టు తల్లి గట్టిగా చెప్పింది. తల్లి నుంచి ఇలాంటి బెదిరింపులు మామూలే గనుక.. ఈసారి కూడా వాడు లెక్కచెయ్యలేదు.

తొమ్మిదేళ్ల బాలమల్లుకు కుటుంబాలు, కుటుంబంలో మనుషుల గురించి కొంత అవగాహన ఉంది. తన దోస్తులు కొంతమందికి నాన్నలున్నరు, కొందరికి లేరు. వాడు రెండో కోవలోకి వస్తాడు. తండ్రి ఎట్లా ఉంటడో వాడికి తెలియదు. ఎన్నడూ చూడలేదు. తల్లి ఏనాడూ తండ్రి ప్రస్తావన వాడి ముందు తేలేదు. అందుకే తను ఏదైనా తప్పుచేస్తే.. తండ్రి కోపంగా చెంపమీద కొట్టే ప్రమాదం తనకు లేదనుకుంటడు. తల్లి తనను ఎప్పుడూ కొట్టదు. ఆమె చేతులు కష్టపడి పనిచేయడం.. తనను ప్రేమగా దగ్గరికి తీసుకోవడం మాత్రమే వాడు చూశాడు.

బాలమల్లు నిశ్శబ్దంగా నక్కుతూ పోయి బొటనవేలు, చూపుడువేలు పట్టకారులా ముందుకు చాపాడు. మెల్లగా నీలంరంగు తూనీగ తోకను పట్టుకోబోయాడు. ఈలోగా తల్లి మళ్లీ పిలిచింది.

''అబ్బా! ఉండవే.. వొస్తన్నా!'' అని విసుగ్గా అరిచాడు.

దాంతో కొద్దిలో చేతికి చిక్కబోతున్న తూనీగ ఎగిరిపోయింది. వాడు నిరాశగా చూశాడు. కానీ, కొన్నిక్షణాలే! తర్వాత పట్టుదలగా వేటాడి.. చిట్టచివరికి ఒకదాన్ని దొరికించుకొని సంతోషంతో గంతేశాడు.

ఇంతలో తల్లి కోపంగా పెరట్లోకి వచ్చింది. బాలమల్లు ఆమెకు దొరికిపోయాడు. వాడి రెండుచేతుల్నీ బిగించి పట్టుకుంది.

''నీకు వేరే ఆటలే లేవా..? ఎన్నిసార్లు చెప్పినా ఇన వేందిరా. తూనీగల్ని పట్టుకొని ఆడొద్దు. పాపం దాన్ని ఇడిసిపెట్టు'' అంటూ, బాలమల్లు రెండువేళ్ల నడుమ బందీగా ఉన్నదాన్ని విడిపించింది. తనెంతో కష్టపడి పట్టుకున్న తూనీగ ఎగిరిపోవడం చూసి నిరాశ చెందాడు. వాడికి ఉక్రోషం కలిగింది.

''ఎప్పుడు చూసినా తూనీగల్ని పట్టొద్దంటవు. ఎందుకు పట్టుకోవొద్దు? ఏమైతదట..?'' చేతులు విడిపించుకుని అడిగాడు.

''తూనీగలు మామూలువి కావు బిడ్డా! అవి సచ్చిపోయిన మన పెద్దల ఆత్మలు. మన పితరులు.. తూనీగల రూపంల ఎగురుతూ మనచుట్టే తిరుగుతుంటరు''.

''అయితే సచ్చిపోయినోళ్లందరు తూనీగలైతరా?''.

''అవును! వాళ్ల ఆత్మలు వాటి రూపాల్లో తిరుగుతుంటయని చిన్నప్పుడు మా అమ్మ నాతో చెప్పేది. ఇప్పుడు బతికి ఉన్న పెద్దవాళ్లు ఎవర్నడిగినా.. ఈ మాటనే చెప్తరు. మీ తాత, మీ నాయినమ్మ, వాళ్ల నాయిన, వాళ్లమ్మ, ఇంకా మన చుట్టాలు, దగ్గరోళ్లు, మన పాలోళ్లు.. ఇట్లా అందరి ఆత్మలు తూనీగలై మన చుట్టుపక్కలనే తిరుగుతయి. మన మంచిచెడ్డ చూస్తుంటయి. వాటి భాష మనకు ఇనపడకపోయినా.. అవి మనల్ని పలుకరిస్తుంటయి. మన క్షేమాన్ని కోరుతుంటయి''.

తల్లి మాటలు బాలమల్లుకు ఆశ్చర్యం కలిగించినయి. వాడిలో ఆసక్తిని పెంచినయి. హఠాత్తుగా మనసులో ఒక సందేహం మెదిలి తల్లిని అడిగాడు..

''అట్లయితే మా నాయిన ఎప్పుడో సచ్చిపోయిండు గద. ఆయినె కూడ తూనీగయిండా?''.

''తప్పురా బాలు.. అట్లనొద్దు'' అన్నదామె వారిస్తున్నట్టు.

''ఎందుకనొద్దు? తప్పెట్లయితది..? నాయిన కూడ మన ఇంటిపెద్దనే. సచ్చినంక తూనీగ అయితడు గద.